సైబర్ భద్రత మరింత బలోపేతం

- మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దు : సిఎం
- మరో 10 సైబర్ క్రైమ్ ప్రత్యేక పోలీస్ స్టేషన్లు మంజూరు



టిజిఎస్‌బి, ఎస్‌సిఎస్‌సి సమావేశాల్లో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిఎస్‌బి), సైబరాబాద్ పోలీసులు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సిఎస్‌సి) సమావేశాలు మంగళవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ భద్రతా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని చెప్పారు. వ్యాపారాలు, ప్రభుత్వ వ్యవస్థలు, పౌరులను రక్షించడానికి తెలంగాణ పోలీస్ ఎంతో దృఢంగా పనిచేస్తోందని తెలిపారు.

ముఖ్యంగా మత్తు పదార్థాల నివారణ విషయంలో అనునిత్యం నిఘా పెట్టి.. మత్తు పదార్థాలను విక్రయించే వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కేసులు నమోదు చేసి, వారిని జైలుకు పంపించారని వివరించారు. మత్తు పదార్థాలకు బానిసైన యువతకు మానవతా దృక్పథంతో అనేక రకాల కౌన్సెలింగ్ ఇచ్చి సమాజంలో మంచి పౌరునిగా మెలిగే విధంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ పని చేస్తోందన్నారు. సైబర్ క్రైమ్ నేరాలపై దేశంలోని మన పోలీస్ వ్యవస్థ ముందుండి పని చేయడంలో భాగంగా బాధితులు పోగొట్టుకున్న సొమ్మును తిరిగి ఇప్పిస్తోందన్నారు. 2024లో 18 వేల మంది బాధితులకు రూ.183 కోట్లు తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. సైబర్ భద్రతా చట్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం, చట్టం, సంస్థలు, నాయకులు, విద్యాసంస్థల మధ్య బలమైన సహకారం అవసరమని సిఎం చెప్పారు. తెలంగాణ డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఏఐ క్లౌడ్ భద్రతను ఉపయోగించడం, దాని ప్రాముఖ్యతను ప్రధానంగా వివరించారు. మరో 10 సైబర్ క్రైమ్ ప్రత్యేక పోలీస్ స్టేషన్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐటి పరిశ్రమకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా పనిచేస్తుందని చెప్పారు. ఎంతో సమర్థవంతంగా అనేక సైబర్ నేరాలపై అత్యంత త్వరగా కేసులను దర్యాప్తు చేస్తూ శాంతి భద్రత విషయంలో హైదరాబాద్ పోలీస్ ఎంతగానో కృషి చేస్తోందని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్, టిజి సిఎస్‌బి డైరెక్టర్ జనరల్ సిఐడి, సిఐ డైరెక్టర్ శిఖా గోయెల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి విద్యాకమిషన్ ప్రతిపాదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. రాష్ట్రంలో వివిధ వర్గాలతో వరుస చర్చలు జరిపి వారి నుంచి అనేక సలహాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం అస్తవ్యస్తం చేసిందని పేర్కొన్నారు. దాని ఫలితంగా అభ్యాస పేదరికం ఏర్పడిందని వివరించారు. ప్రస్తుత విద్యారంగం దుస్థితి వల్ల ప్రజా, పౌర సమాజ సంస్థల నుంచి ఒత్తిడి, అశాంతి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగంపై తక్షణ జోక్యం చేసుకోవాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో రాష్ట్ర బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రూపొందించడంలో అభివృద్ధి, ప్రాధాన్యతలకు దిశానిర్దేశం చేయడం కోసం ఈ బడ్జెట్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు విశ్వవిద్యాలయాలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి కావాల్సిన బడ్జెట్‌ను తయారుచేసి సమర్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ఫౌండేషనల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి అంతర్జాతీయ ప్రమాణాలు, ఉత్తమ అభ్యాస వాతావరణం, ఉత్తమ బోధనా వాతావరణంతో కూడిన ఉత్తమ పాఠశాల ప్రమాణాలు కలిగి ఉండేలా బడ్జెట్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిషన్ సభ్యులు పిఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద కజారియా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోనే అతిపెద్ద సిరామిక్ అండ్ విట్రిఫైడ్ టైల్ తయారీదారుగా పేరున్న కజారియా హైదరాబాద్ లో అతిపెద్ద ఎటర్నిటీ, కెరోవిట్ ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 15,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన దీనిని మంగళవారం దీనిని ఆ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రిషీ కజారియా లాంచనంగా ప్రారంబించారు. కజారియా తయారు చేసే ప్రత్యేకమైన టైల్, బాత్, శానిటరీవేర్ కలెక్షన్ ను ప్రతీ కుటుంబానికీ అందుబాటులో ఉంచడమే తమ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లో నెలకొల్పిన ఈ మెగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను.. నానాటికీ విస్తరిస్తున్న వారి నెట్‌వర్క్‌కు మరో మైలురాయిగా ఆయన అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా వరల్డ్ క్లాస్ డిస్ ప్లేస్‌ను అందుబాటులోకి తేవాలనే కజారియా ఆలోచనకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తుందని చెప్పారు.

సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌కు భూటాన్ ప్రధాని రాక

న్యూఢిల్లీ : సోల్ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్ తొలి ఎడిషన్ ప్రారంభ సమావేశానికి గౌరవ అతిథిగా భూటాన్ ప్రధాన మంత్రి దాషో షెరింగ్ టోబ్గే హాజరుకానున్నారు. ఫిబ్రవరి 21, 22వ తేదిల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సమావేశం జరుగనుంది. ప్రధాని నరేంద్ర మోడీ ఈ ఎడిషన్‌ను ప్రారంభించనున్నారని సోల్ లీడర్‌షిప్ నిర్వాహకులు తెలిపారు. భూటాన్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పరివర్తన చెందడంలో ఆయన కీలక భూమిక పోషించారని పేర్కొన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో రాజకీయాలు, క్రీడలు, కళలు, మీడియా, వ్యాపారం, పబ్లిక్ పాలసీ, సామాజిక రంగం వంటి వివిధ రంగాలకు చెందిన నేతలు తమ అనుభవాలను అందించనున్నారని తెలిపారు.

వైద్యారోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యత

- డిప్యూటీ సిఎంల భట్టి, మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్యారోగ్యశాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్యారోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునీకరిస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆస్పత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి..

- ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి
- వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2025 ఫిబ్రవరి 27న జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో నర్సిరెడ్డి మాట్లాడుతూ.. 2019లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేశానన్నారు. యుఎస్ పిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యోగ, ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. కెజిబివి, యుఆర్‌ఎస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు వేసవి సెలవులు సహా 12 నెలలు జీతం వచ్చేలా చేయడంలో కృషి చేశానని చెప్పారు. తెలంగాణ మొదటి పిఆర్‌సిని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడంలో, 180 రోజుల ప్రసూతి సెలవులను సాధించడంలోనూ అద్వితీయమైన కృషి చేశానన్నారు. బేసిక్ పే సాధన కోసం పని చేస్తున్నామన్నారు. పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి పని చేశానని, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలకు ఏర్పడిన న్యాయమైన ఆటంకాలను అధిగమించి బదిలీలు జరిగే విధంగా ఉత్తర్వులు సాధించానని తెలిపారు. ప్రమోషన్లు, 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు కోసం కృషి చేశానన్నారు. ఎయిడెడ్ టీచర్లకు సకాలంలో వేతనాలు మంజూరు కోసం నిరంతరం పాటుపడ్డానన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, ప్రమోషన్లు జరిపించడంతోపాటు పండిట్, పిఇటిల పోస్టుల అప్‌గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, సిఆర్‌టి వేతనాల సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేశానన్నారు. పాఠశాల విద్యారంగంలో నిలిచిపోయిన ఉపాధ్యాయ ప్రమోషన్స్, బదిలీలు జరగడానికి తన వంతు కృషి చేశానని వివరించారు. టెట్ వివాదం పరిష్కారానికి ఢిల్లీలో ఎన్‌సిటిఇ అధికారులతో చర్చించి మార్గం సుగమం చేశానన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ సాధించడంతో అత్యంత కీలకమైన పాత్ర పోషించానన్నారు. డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల బదిలీల షెడ్యూల్ జారీ చేయించానన్నారు. కాకతీయ, మహాత్మాగాంధీ యూనివర్సిటీలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ సమయంలో ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఉత్తర్వులు సాధించానన్నారు. ప్రయివేట్ విశ్వవిద్యాలయాల బిల్లును వ్యతిరేకించి ఏకైక ఎమ్మెల్సీగా నిలిచానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన భవనాలు, ప్రహరీల నిర్మాణానికి కేటాయించడమే కాకుండా వాటిని సకాలంలో వినియోగించానన్నారు. పేద ప్రజలకు వైద్య సహాయం కోసం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించానని వివరించారు. తన వేతన భత్యాలను కూడా ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసి చట్టసభల సభ్యులకు రోల్ మోడల్‌గా నిలిచానన్నారు. అంగన్‌వాడీ, ఆశ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. వారి పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. మరోసారి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మరిన్ని సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం పాటుపడటమే కాకుండా ఉపాధ్యాయ, అధ్యాపకుల పక్షాన నిలుస్తానని హామీ ఇచ్చారు.

మహాశివరాత్రి జాతరకు రండి

- సిఎంను అహ్వానించిన విప్ ఆదిశ్రీనివాస్, దేవాలయ కమిటీ

హైదరాబాద్ బ్యూరో : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా జరిగే మహోత్సవానికి రావాలని సిఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు, అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. మంగళవారం ఈ మేరకు సిఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయాభివృద్ధి పనుల గురించి సిఎం అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ, ఆలయ అభివృద్ధికి వెంటనే నిధులు విడుదల చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు.

కనీసం రూ.16 వేల కోట్ల నిధులివ్వండి

కేంద్రం తన బాధ్యత నెరవేర్చాలి : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో తాగునీటి వ్యవస్థ స్థిరీకరణ కోసం నిటిఅయోగ్ సిఫారసులకు అనుగుణంగా కనీసం రూ.16 వేల కోట్లను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క) కోరారు. ఏటా తాగు నీటి అవసరాల కోసం తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ. ఐదు వేల కోట్లను వెచ్చిస్తోందని గుర్తు చేశారు. భగీరథ కోసం రూ.28 వేల కోట్లను బ్యాంకుల నుంచి రుణాల రూపంలో తీసుకున్నామనీ, ఏటా రూ. 1,185 కోట్లను వార్షిక వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తున్నదని తెలిపారు. నిర్వహణ, విద్యుత్ ఖర్చుల కోసం ఏటా మరో రూ. 1,527 కోట్లను వెచ్చిస్తున్నామన్నారు. వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రజలకు తాగునీరు అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలే తప్ప నిధులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తాగు, సాగునీటి పారుదల శాఖ మంత్రుల రెండో సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న మిషన్ భగీరథ, ఇతర తాగు నీటి పథకాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. స్వచ్ఛమైన, సురక్షితమైన తాగు నీటిని పొందడం ప్రజల ప్రాథమిక, రాజ్యాంగ హక్కు అనీ, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని నొక్కి చెప్పారు. వేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న అవసరాల నేపథ్యంలో తాగు నీటి కొరతను తీర్చేందుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ తాగు నీటి సరఫరాను పెంపొందించడంలో పంచవర్ష ప్రణాళికలు ఎంతో దోహద పడ్డాయని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కేంద్రంలో గత ప్రభుత్వాలు ముందు చూపుతో వ్యవహరించడం వల్ల 1980 నాటికే 83 శాతం గ్రామీణ ప్రాంతాలకు కనీసం ఒక తాగునీటి వనరు అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రాజీవ్ గాంధీ నేషనల్ డ్రింకింగ్ వాటర్ మిషన్, నేషనల్ రూరల్ డ్రింకింగ్ వాటర్ ప్రోగ్రాం వంటి కార్యక్రమాలు సురక్షితమైన తాగునీటిని అందించడానికి కృషిచేశాయన్నారు. దానికి కొనసాగింపుగా కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటి నల్లా నీళ్లిచ్చే పథకాన్ని అమలు పరుస్తోందన్నారు. తెలంగాణలో 1,59,312 చేతి పంపులు, 14,054 సింగిల్ విలేజ్ స్కీమ్‌లు, 149 మల్టీ విలేజ్ స్కీమ్‌లు, వేలాది పైప్డ్ వాటర్ సప్లయ్ స్కీంలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, లక్షలాది నల్లా కనెక్షన్లతో ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చామన్నారు. గతంలోని తాగు నీటి సరఫరా పథకాలు, మౌలిక సదుపాయాలను అనుసంధానం చేస్తూ ప్రతి మనిషికీ రోజుకు సగటున వంద లీటర్ల నీటిని సరఫరా చేసే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకం 2016 లో మొదలైందని, రూ. 28 వేల కోట్ల రుణాలతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకంలో ఉన్న లోపాలను సరిదిద్ది, మరింత పటిష్ట పరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. సుదూర ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నుంచి సరఫరా చేసేక్రమంలో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. అందుకే స్థానిక నీటివనరులను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందిస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. వేయి కోట్ల వ్యయంతో అనేక నియోజకవర్గాలకు తాగు నీరిచ్చేలా 18 ప్రాజెక్టులను ప్రారంభించామని తెలిపారు. గత వేసవిలో తమ ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చించిందన్నారు. భారీ వర్షాల కారణంగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు తీవ్రంగా దెబ్బతిన్నా...తాత్కాలిక ప్రాతిపదికన స్థానిక వనరుల నుంచి తాగు నీటిని అందించడం తమ ప్రభుత్వ విజయమని చెప్పారు. మిషన్ భగీరథను సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టామని, మొబైల్ యాప్ ద్వారా నీటి సరఫరా, నిర్వహణ వ్యవస్థను నిరంతరాయంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం 24 గంటల పాటు పనిచేసేలా టోల్ ఫ్రీ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ హెచ్‌యుసి నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా లెనిన్, పంకజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎఫ్‌ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీ 41 మందితో ఎన్నికైంది. కమిటీ 18వ మహాసభ క్యాంపస్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. అంతర్జాతీయ, జాతీయ సమస్యలు, విద్యార్థుల సమస్యలపై చర్చించి, వివిధ తీర్మానాలు చేశారు. విద్యావ్యవస్థ ప్రయివేటీకరణ, కేంద్ర విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. అనంతరం ఈ మహాసభ 41 మందితో కమిటీ.. 15 మందితో కారదర్శివర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా లెనిన్, కార్యదర్శిగా పంకజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అతీక్, దేబస్రీత, మోహిత్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సుభాషిణి, ఆకాశ్, కృప ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యలపై, విద్యార్థి వ్యతిరేక పాలసీలపై నిరంతరం పోరాటాలు చేస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు చెప్పారు.



ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఎసిబి దాడులు

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన రేంజర్, బీట్ ఆఫీసర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆయనో గెజిటెడ్ ఆఫీసర్, నెలకు వేతనం లక్ష. అయినప్పటికీ అధికారం చేతిలో ఉంది కదా అని లంచాలకు మరిగారు. ఇటు గిరిజనులకు, అటు ప్రభుత్వానికి సేవ చేయాల్సింది పోయి డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని 24 ఏరియా మైనార్టీ ప్రిన్సిపాల్ కృష్ణ రూ.2000 తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తాజాగా మంగళవారం మండలంలోని కొమరారం రేంజ్ పరిధిలో రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. అటవీ భూమి నుంచి మట్టి తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్‌ను రూ.30 డిమాండ్ చేశారు. గతంలోనే ఇదే పనికి రూ.20 వేలు లంచం పుచ్చుకున్నట్టు తెలిసింది. మళ్లీ గ్రావెల్ తీస్తుండగా అటవీ శాఖ సిబ్బంది వచ్చి జెసిబి, ట్రాక్టర్లు పట్టుకున్నారు. మరోసారి రూ.15 వేలు మామూలు ఇచ్చినట్టు తెలిసింది. మళ్లీ తాజాగా రూ.50 వేలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకుని.. వేధింపులు భరించలేక విసిగిపోయిన గుత్తేదారు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో ఎసిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో కొమరారం అటవీ రేంజ్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్‌ను పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాహుల్‌కు కాళేశ్వరం మహా కుంభాభిషేక ప్రసాదం

- పంపిన మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం మహా కుంభాభిషేకం ప్రసాదం, కాళేశ్వరుడి ప్రతిమ, త్రివేణి సంగమం(గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు) జలాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, ఎల్‌ఓపి రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఎంపీ ప్రియాంక గాంధీలకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పంపారు. కాళేశ్వరం మహా కుంభాభిషేకం గురించి ఏఐసీసీకి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి క్షేత్రంలో ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. 1982 తర్వాత ఇప్పుడే మహా కుంభాభిషేకం జరిగిందని పేర్కొన్నారు. అందులో శృంగేరి జగద్గురువులు భారత తీర్థ మహాస్వామి, విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి పాల్గొన్నారని తెలిపారు.

టిజిడిపిఎస్ సలహా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ(టిజిడిపిఎస్) సలహా కమిటీని తొమ్మిది మందితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ కమిటీకి చైర్మన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. సభ్యులుగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ శాంతసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్, నిఖిల్ దేయ్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ భూక్యా, ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి ఉండనున్నారు. దీనికి సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 2ని విడుదల చేసింది.

పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది

- బండి సంజయ్ వ్యాఖ్యలపై బండ్రు శోభారాణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి జాబితా నుంచి ముస్లిములను తొలగిస్తేనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పిచ్చోడి చేతిలో రాయిలా ఉన్నాయని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి మాట్లాడాలని సూచించారు. మనుగడ కోసం మాజీ మంత్రి కెటిఆర్ రైతు దీక్షలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించేందుకు సిఎం రేవంత్ కృషి చేస్తున్నారని తెలిపారు.

వర్సిటీల అభివృద్ధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలి

- ఇతర సమస్యలను పరిష్కరించాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు) సందర్శించిన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్లు అక్కడి సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లను సుదీర్ఘకాలం కొనసాగిస్తున్నారని వివరించారు. నిధుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ల్యాబ్ పరికరాలు, హాస్టళ్లు, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాల



సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల హాస్టళ్లలో శ్లాబ్ పెచ్చులు ఊడిపడి విద్యార్థులు గాయపడ్డారని వివరించారు.

వందేండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయానికి నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపులో వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినిలపై వేధింపులు నిరోధించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఒక్కటే కాకుండా ప్రతి వర్సిటీని కూడా స్కిల్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. అందుకవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా పరిశీలించి వర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

డిమాండ్లు :

- విశ్వవిద్యాలయాలకు రూ.ఐదు వేల కోట్లు, ప్రత్యేకంగా ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.
- వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.
- నూతన భవనాలను నిర్మించాలి. మోడ్రన్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి.
- ప్రతి పిహెచ్‌డి విద్యార్థికి నెలకు రూ.25 వేలు ఫెలోషిప్‌లను అందించాలి.
- అన్ని వర్సిటీలకూ రీసెర్చ్ గ్రాంట్లను ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి.
- కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్ల వేతనాలను పెంచాలి.
- వర్సిటీల్లో విద్యార్థి సంఘం గుర్తింపు ఎన్నికలను నిర్వహించాలి.

హత్యకేసులో 17 మందికి జీవితఖైదు

- నల్లగొండ ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ సెషన్స్ కోర్టు తీర్పు
- చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్షలు తప్పవు : రాచకొండ సిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో పాత కక్షలతో జరిగిన హత్య కేసులో 17మందికి నల్లగొండ ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ సిపి సుధీర్‌బాబు వెల్లడించారు. అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017లో యాదవ సామాజిక తరగతికి చెందిన ఓ వ్యక్తి మృతి కేసులో బట్ట లింగయ్య జైలుకెళ్లారు. అనంతరం బెయిల్‌పై బయటకొచ్చారు. దసరా పండుగ సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో బట్ట లింగయ్య కుటుంబంతో కలిసి పాల్గొనేందుకు వెళ్లారు. ఆ సమయంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు ఎదురయ్యారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో లింగయ్యపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన లింగయ్య అక్కడికక్కడే మృతిచెందారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసు విచారణ ప్రారంభమైంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న ఎస్ రమేష్ అప్పుడు ఇక్కడ ఎసిపి హోదాలో ఈ కేసు విచారణను వేగవంతంగా పూర్తి చేసి సాక్షాధారాలను కోర్టు ముందు ఉంచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలు వినిపించారు. సాక్షాధారాల పరిశీలన అనంతరం నల్లగొండలోని ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ సెషన్స్ కోర్టు 17 మంది నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.6000 చొప్పున జరిమానా విధించింది.

తాత్కాలిక ఆవేశాలతో చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు..

రాచకొండ సిపి సుధీర్‌బాబు

తాత్కాలిక ఆవేశంలో విచక్షణ కోల్పోయి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుంది. భవిష్యత్‌ను కోల్పోయి జైలు జీవితం గడపాల్సి వస్తుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ వ్యక్తులు తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకూడదు. ఎస్‌సి, ఎస్‌టి చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రాచకొండ పోలీసులు అహర్నిశలూ కృషి చేస్తున్నారు.

గుజరాత్‌లో బిసి జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తారా?

- కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు షబ్బీర్ అలీ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌లో బిసి జాబితా నుంచి ముస్లింలను తొలగిస్తారా? అంటూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో బిసిల్లో మైనార్టీలను కలిపారంటూ మాట్లాడటం కాదు...గుజరాత్ సంగతి చూడాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.


సాధారణ వ్యక్తి మాట్లాడితే...ఏదోలే అనుకోవచ్చు కానీ కేంద్ర మంత్రులుగా ఉండి మతాల మధ్య చిచ్చుపెట్టమేంటని వారిని నిలదీశారు. హంటర్ కమిషన్(1882), మిల్లర్ కమిషన్ (1918), కాక కాలేకర్ నివేదిక(1953)ల్లో ఏముందో చూడాలని కోరారు. ఇప్పటికీ అత్యంత వెనకబడిన మైనార్టీలను బీసీ జాబితాలోనే ఉన్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపారు. ఆయా కమిషన్లు ఇచ్చిన నివేదికల ఆధారంగానే తమ ప్రభుత్వం పని చేసిందన్నారు.

కృష్ణా జలాల వివాదంలో కేంద్రం జోక్యం చేసుకోవాలి

- ఉదయపూర్ వాటర్ సదస్సులో మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు అన్యాయం జరగకుండా నిరోధించడానికి కృష్ణా నీటి వివాదంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయపూర్‌లో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆమోదించిన రెండో ఆల్ ఇండియా స్టేట్ వాటర్ మినిస్టర్స్ కాన్ఫరెన్స్ -2025లో మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి కృష్ణా నది నీటిని అక్రమంగా మళ్లించకుండా ఆపడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణా నది నీటి వినియోగాన్ని పర్యవేక్షించడానికి టెలిమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. తెలంగాణ న్యాయమైన వాటాను రక్షించడానికి కృష్ణా జలాల వివాదం ట్రిబ్యునల్ కేసును త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన, చిన్న సాగునీటి ప్రాజెక్టుల పూడికతీత, డీసెడిమెంటేషన్ ఖర్చును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. ఇది ఇతర రాష్ట్రాల్లోని ఇలాంటి ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్‌ఎ) విచారణను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ముందుకు సాగడానికి కేంద్రం నుంచి స్పష్టమైన లిఖిత సిఫార్సును అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర ఫ్రేమ్‌వర్క్ ప్రకారం ప్రధాన, మధ్యస్థ సాగునీటి



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రాజెక్టులలో పూడికతీత, డీసెడిమెంటేషన్ ప్రయత్నాలను ప్రారంభించిందన్నారు. ఈ ప్రయత్నాలకు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతున్నట్టు చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టుపై ఎన్‌డిఎస్‌ఎ విచారణ గురించి, ఈ విచారణ చాలా నెలలుగా పెండింగ్‌లో ఉందన్నారు. త్వరితగతిన పూర్తి చేయడానికి, తెలంగాణ ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణను నిర్దేశించడానికి జలశక్తి మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలని మంత్రి కోరారు. గంగా, యమునా పునరుద్ధరణ ప్రాజెక్టులకు అందించిన మద్దతుతో సమానంగా మూసీ ప్రాజెక్టుకు కూడా పూర్తి ఆర్థిక మద్దతును కేంద్రం అందించాలని కోరారు. ఈ ప్రయత్నం నది పర్యావరణాన్ని పునరుద్ధరించడం, మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడం, హైదరాబాద్ కోసం స్థిరమైన నీటి నిర్వహణను నిర్ధారిస్తూ పట్టణ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మూసీ నది వెంట ట్రంక్ , ఇంటర్‌సెప్టర్, సీవర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడానికి రూ. 4,000 కోట్లు అవసరమని చెప్పారు. గోదావరి నదిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లతో లింక్ చేయడానికి అదనంగా రూ. 6,000 కోట్లు కేంద్రం ఇవ్వాలని కోరారు. ఈ లింకేజ్ హైదరాబాద్ తాగునీటి సరఫరాను భద్రపరచడంతో పాటు మూసీ నది పునరుద్ధరణను కూడా సహకరిస్తుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, సమక్క-సరక్క ప్రాజెక్ట్, సీతారామసాగర్ ప్రాజెక్ట్ కోసం నీటి కేటాయింపును త్వరగా పూర్తిచేయాలని, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీ రేటుతో దీర్ఘకాలిక నిధులను అందించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

జెఎన్‌టియు హైదరాబాద్ విసిగా టికెకె రెడ్డి

- బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జెఎన్‌టియు) హైదరాబాద్ ఉపకులపతి (విసి)గా ప్రొఫెసర్ టి కిషెన్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జెఎన్‌టియు హైదరాబాద్ విసి కోసం సెర్చ్ కమిటీ సమావేశమైన విషయం తెలిసిందే. ముగ్గురు ప్రొఫెసర్ల జాబితాను ప్రభుత్వానికి పంపించింది. వాటిని పరిశీలించి గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వ ప్రతిప్రాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించి టి.కిషెన్ కుమార్ రెడ్డిని జెఎన్‌టియు హైదరాబాద్ విసిగా ఆమోదించారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు. మంగళవారమే ఆయన జెఎన్‌టియు హైదరాబాద్ విసిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉన్నత విద్యామండలి చైర్మన్, జెఎన్‌టియు హైదరాబాద్ ఇన్‌చార్జ్ విసి వి బాలకిష్టారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతోపాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కెబిసి గ్లోబల్ బోనస్ షేర్‌కు ఆమోదం

న్యూఢిల్లీ : ఇన్‌ఫ్రా కంపెనీ కెబిసి గ్లోబల్ లిమిటెడ్ 1:1 నిష్పత్తిలో బోనస్ ఈక్విటీ షేరుకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. తమ వాటాదారులకు ప్రతి ఈక్విటీ షేరుకు గాను మరోక్క బోనస్ ఈక్విటీ షేరును అందించనున్నట్లు పేర్కొంది. సమీప భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలు, రుణ తగ్గింపులను వేగవంతం చేసే ప్రణాళికలతో వ్యాపార కార్యకలాపాలను పునరుద్ధరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. బోనస్ ఇష్యూ కోసం మొత్తం రూ.261.43 కోట్లు ఉపయోగించనున్నట్లు పేర్కొంది.

పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ పథకం

- మంత్రి తుమ్మల వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అడవి జంతువులు, కోతుల నుంచి పంటల రక్షణ కోసం సోలార్ పెన్సింగ్ పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పామాయిల్‌తోపాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశించారు. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో పామాయిల్ కర్మాగారం, మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రగతి చూపని పామాయిల్ కంపెనీలపై చర్యలు ప్రారంభిస్తామన్నారు. విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యానశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు.

జియోథింగ్స్‌తో ప్యూర్ ఇవి ఒప్పందం

హైదరాబాద్ : ద్విచక్ర వాహనాల తయారీ సంస్థల్లో ఒక్కటైన ప్యూర్ ఇవి సంస్థ, జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన జియో థింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. దీంతో తమ జియో థింగ్స్ యొక్క స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లు, టెలీమ్యాటిక్స్‌ను తమ ఎలక్ట్రిక్ వాహనాల్లోకి అనుసంధానించనున్నట్లు పేర్కొంది. అధునాతన ఐఒటి సొల్యూషన్స్, నిరాటంకమైన కనెక్టివిటీ, సమగ్రమైన డిజిటల్ అనుసంధానతను ఉపయోగించుకుంటూ వినియోగాదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందించాలనేది తమ ఈ భాగస్వామ్య లక్ష్యమని ప్యూర్ ఇవి ఎండి నిశాంత్ దొంగారి పేర్కొన్నారు.

సోలార్, బ్యాటరీ ఉత్పత్తుల్లోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇన్‌ఫ్రా (ఆర్‌ఇన్‌ఫ్రా) కొత్తగా రెన్యువెబుల్ ఎనర్జీ పరికరాల తయారీలోకి ప్రవేశించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం తన రెన్యూవెబుల్ మానుఫ్యాక్చరింగ్ విభాగానికి సిఇఒగా ఇవాన్ సహాను, బ్యాటరీ మానుఫాక్చరింగ్‌కు చీఫ్‌గా మస్తాక్ హుస్సెన్‌ను నియమించింది. భారత్‌లో సోలార్ ఉత్పత్తుల తయారీ కోసం కేంద్రీకృత ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని సమాచారం. దీంతో క్లీన్ ఎనర్జీలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆర్‌ఇన్‌ఫ్రా లక్ష్యంగా పెట్టుకుందని తెలుస్తోంది.



కబ్జా భూమి వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అక్రమ పట్టా పాస్‌బుక్.. ఇనాం భూమి కబ్జా!

- బ్రాహ్మణపల్లి గ్రామస్తుల ఆరోపణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇనాం భూమిపై కన్నేసిన కొందరు పట్టా పాస్‌బుక్ సృష్టించి కబ్జా చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని కొత్తచెరువు సమీపంలో సర్వే నంబర్ 63 లో గల 25 ఎకరాల మూడు గుంటల భూమి ఉంది. దాన్ని కొంత మంది కబ్జా చేశారని గ్రామస్తులు పలువురు ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దొంగ పాసుబుక్కులు సృష్టించి కబ్జా చేశాడని బ్రాహ్మనపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ భూమిని పోలీసుల సహకారంతో చదును చేస్తున్నాడని తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని ఎలా కబ్జా చేస్తావని అడిగితే పోలీసుల చేత భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని చెప్పారు. హైదరాబాద్ చెందిన సదరు కబ్జాదారునికి తమ గ్రామానికి చెందిన కొందరు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కలగజేసుకొని తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు, యాదయ్య, నర్సింలు, రాములు, నాగరాజు, రమేష్, అంజయ్య, నాగరాజు, రాములు, కిష్టా గౌడ్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



జానపద కళాకారులకు శివరాత్రి ప్రదర్శనలు ఇప్పించాలి

- జానపద వృత్తి పరిరక్షణ జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా తమ కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలని జానపద వృత్తి పరిరక్షణ జెఏసి అధ్యక్షులు మురళీధర్ దేశ్‌పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. 15 ఏళ్ల కిందట డిపిఆర్ఓ కింద కళాకారులకు జీవనభృతి కల్పించారని, కానీ తెలంగాణ వచ్చినప్పటి నుంచి జీవనభృతి లేదని అన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డు, పింఛన్లు, ఇండ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రవీంద్రభారతి అగ్రహారంగా మారిందన్నారు. తక్షణమే తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యక్షగాన జానపద కళాకారులపై సమగ్ర సర్వే చేయాలని, రవీంద్రభారతిలో జానపద కళాకారుల ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు రూ.500 కోట్లు కేటాయించాలని, అకాడమీకి చైర్మన్‌ను నియమించాలని కోరారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని, కళాకారులంతా రోడ్డెక్కి ఆందోళనకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు చైర్మన్ వి రామకృష్ణారెడ్డి, జానపద మీడియా ఇన్‌చార్జి సిహెచ్ సుధాకర్ బ్రాహ్మణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

కులగణనను వినియోగించుకోవాలి

- బిసి కమిషన్ చైర్మన్ జి నిరంజన్
- బిజెపిది కుటిల రాజకీయం
- దమ్ముంటే కేంద్రం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి : విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులగణనకు సంబంధించి బిసి సంఘాల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వ మరోసారి గడువు పొడిగించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. హైదరాబాద్ గోల్నాక డివిజన్ పరిధిలోని కాచిగూడలో మంగళవారం కులగణనపై పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావుతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కులగణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని, ఈ సర్వేలో పాల్గొని కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్యూమరేటర్లు, వార్డు అధికారులకు సర్వేకు సంబంధించిన దిశా నిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సర్వే ఈనెల 28 వరకు కొనసాగనుందన్నారు. మూడు విధాలుగా వివరాల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఎన్యూమరేటర్లను పిలిపించుకునే ఛాన్స్ ఇచ్చిందని చెప్పారు. 040 21111111 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు కాల్ చేసి అడ్రస్ చెప్తే.. ఫోన్ చేసినోళ్ల ఇంటికి ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటారని వివరించారు. ఈసారి ఆన్‌లైన్‌లో ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు ఇచ్చే ఆప్షన్ కూడా ఉందన్నారు. వార్డు కార్యాలయాలను సంప్రదించొచ్చన్నారు. వీహెచ్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సోనియాగాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందే విధంగా కులగణన చేపడుతున్నామని తెలిపారు. బీజేపీ కుటిల రాజకీయం చేస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాలని, అనవసరంగా రాజీవ్‌గాంధీ, రాహుల్‌గాంధీ తదితర నాయకులను విమర్శించడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, అప్సర్ నవాబ్ జాహి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలు పునూరి కృష్ణగౌడ్, పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్, పోలినేని రామ్మోహన్ రావు, గడ్డం శ్రీధర్ గౌడ్, కోటం అనిల్ కుమార్, జమీర్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సిఎంకు.. రియల్‌ఎస్టేట్ తప్ప స్టేట్‌పై ఫికర్ లేదు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి
- ఆమనగల్ రైతు నిరసన దీక్షలో కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్‌పై ఉన్న ఫికర్ రాష్ట్రంపై లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. రాష్ట్రంలో పది శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా రాలేదన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణం మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో సిఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతూ.. అత్తగారి ఊరిలో ఉన్న వెయ్యి ఎకరాల భూముల ధరలను పెంచేందుకు డబుల్ రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందే వెల్దండ మండలంలో తమ కుటుంబ సభ్యులకు ఉన్న 500 ఎకరాల భూమికి తోడు ఇటీవల మరో 500 ఎకరాల భూమిని సిఎం, ఆయన సోదరులు దొబ్బేసినట్టు చెప్పారు. రైతు రుణమాఫీ కాక రైతులు, పెండింగ్ బిల్లులు అందక మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెళ్లి కానుక తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారో రేవంత్‌రెడ్డిని ప్రజలు ప్రశ్నించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. పిట్ట కథ చెబుతూ.. 'తాగుడుకు బానిసై తల్లిదండ్రులను చంపిన వ్యక్తి కోర్టులో న్యాయవాది ముందు నేను అమ్మానాన్న లేని అనాథను.. నన్ను క్షమించండి సార్' అన్నట్టుగా సిఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ నుంచే ఆయన పతనం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు.